# చెలిమికి చిరుకానుక



— కాంద్రేగుల శ్రీనివాసరావు

అలవాటుపడిన నా కాళ్ళు అటువైపు నడిచినయి వడివడిగా.

అది ఓ పాత పుస్తకాల షాపు.

అక్కడ ఎడ్యుకేషన్స్ బుక్స్, లిటరేచర్ ఫిలాసఫీ చిల్డ్రన్ బుక్స్ ఇలా ఒక్కటేమిటి అన్ని రకాల సాహితీ మాస పక్ష వార పత్రికలు కూడా సగం ధరకే దొరుకుతాయి.

ఆ షాపు అంటే నాకు ఎనలేని మక్కువ. చిరకాల పరిచయం కూడా...

నా ఇరవయ్యో ఏట నుంచి ఇప్పటిదాకా ఆ షాపుకి నేను తరచూ వస్తూనే వున్నాను. ఇప్పుడు నా వయసు నలభై పైబడింది.

అలాగని నేను సాహితీవేత్తను కాను. విమర్శకుడ్ని అంతకన్నా కాను. నా కున్న జిజ్ఞాసకొలది కనిపించిన పుస్తకమల్లా ఆద్యంతమూ చదివేయడమే నా అలవాటు.

ఆనాటి భారతి నుంచి ఈనాటి మాస వార పత్రికల వరకూ అలాగే గురజాడ నుంచి గుడిపాటి వరకూ, కొడవటిగంటి నుంచి హాశీపట్నం వరకూ, రావిశాస్త్రి నుంచి రంగనాయకమ్మ వరకూ, యద్దనపూడి నుంచి యండమూరి వరకూ అన్ని కాలాల రచనల్ల అన్ని రకాల రచనల్ల చదివేను. చదువుతూనే వున్నాను.

ఇన్ని పుస్తకాలు నా చేత చదివించిన ఘనత ఈ షాపుకే దక్కుతోంది. ఎందరెందరో మహానుభావులు తమ అనుభవాల అనుభూతుల్నీ, గుండె చప్పుళ్ళనీ అక్షర రూపం ఇవ్వడానికి ప్రసవవేదనతో ఎంత సతమతమౌతూంటారో కదా! అని తరచూ ఆలోచిస్తూంటాను.

సన్నివేశాల స్పందన నుంచి స్పందించే హృదయాలు చిందించే సందేశాల సముదాయం ఆ షాపు.

నేను అక్కడికి చేరేసరికి –

"రండి మాస్టారూ..." అంటూ అతడు ఆప్యాయంగా ఆహ్వానించాడు.

నేను చిరుమందహాసం చేసి రేక్ దగ్గరకు నడిచి పుస్తకాలు చూడడంలో నిమగ్నమయ్యాను.

అక్కడ సమయం సంగతి తెలియదు. నిమిషాలు నడచిపోతూ గంటలు గడిచిపోతూంటాయి.

నాకు కావాలనుకుంటున్న పుస్తకాలన్నింటినీ ఓ చోట పెడుతున్నాను.

సరిగ్గా అప్పుడు కనిపించింది పుస్తకం, పై రేక్‌లో నీలం రంగు బైండింగ్ అట్టతో ఎప్పుడో ఎక్కడో చూసిన గుర్తు. ఆత్రంగా అందుకుని అటూ ఇటూ పరికించి పేజీ తిప్పాను.

యాదృచ్ఛికమో లేక కాకతాళీయమో తెలియదు.

నేను నిశ్చేష్టుడునయ్యాను

'మిత్రునికి '– ప్రేమతో చిరుకానుక'. క్రింద నా పేరు వ్రాసి వుంది. నా స్వదస్తూరితో.

చేతిలో పుస్తకం పేజీలు రెపరెపలాడుతున్నట్లే స్మృతిపుటలు కూడా కదులుతున్నాయి.

జీవిత ప్రవాహంలో ఎప్పుడో... ఎక్కడో... ఎవరికో ఇచ్చిన బహుమతి అది. కానీ ఇక్కడికెలా వచ్చింది? దానిని ఎవరికిచ్చాను?

మస్తిష్కం మేల్కొని గతాన్ని తవ్వుతూంది.

కృష్ణమూర్తి???

అవును. గ్రహీత కృష్ణమూర్తే!

పదిహేను సంవత్సరాల క్రితం, సముద్రం వద్దున ప్రశాంతత కోసం నేను తరచూ వెళ్ళి, సాయం సంధ్యవేళల్ని సజావుగా గడిపే రోజులలో, కృష్ణమూర్తి పరిచయం మరువలేనిది, మరవురానిదని భావించుకునే ఆ రోజులలో నా మైత్రికి పవిత్రమైన జ్ఞాపకంగా ఆ వుస్తకాన్ని నేను బహూకరించాను అతనికి.

ఆప్తమిత్రునికి ఆప్యాయతతో ఇచ్చిన అరుదైన కానుక సెకెండ హాండిల్ బుక్‌స్టాల్‌లో సగం ధరకే అమ్మకానికి సిద్ధంగా వుండడం చూసి నా మనసు చివుక్కుమంది.

కానుక పట్ల కృష్ణమూర్తి నిర్లక్ష్యం నన్ను తీవ్ర మనస్తాపానికి గురిచేసింది.

పవిత్ర స్నేహానికి ప్రతీకలైన కానుకలను అశ్రద్ధ చేయకుండా వుండడానికి అతనికి గట్టిగా బుద్ధి

చెప్పాలని నిశ్చయించుకున్నాను.

అవును. ఆతనికి కనువిప్పు కలగాలంటే ఈ పుస్తకాన్ని మళ్లీ అతనికే బహూకరించాలి. అప్పుడు అతని ఫీలింగ్స్ ఎలా వుంటాయో చూడాలి. ఈ ఆలోచన బావుంది. సంతృప్తిగా ఊపిరి పీల్చాను.

ముందర తీసిన పుస్తకాలతో ఈ పుస్తకాన్ని కలిపి మొత్తాన్ని చెల్లించేసి ఇంటి వైపు నడుస్తూ ఆలోచించసాగేను.

అవునూ అతనిప్పుడెక్కడున్నాడో?

వత్సరాల వియోగం తరువాత, మళ్ళీ అతను లభ్యమవడం ప్రశ్నార్థకమే?

అయినా సరే ఎలాగైనా అతన్ని వెతికి పట్టుకోవాలి. కృష్ణమూర్తి అడ్రస్ చూచాయిగా గుర్తుంది నాకు. పిల్లలూ, మనుమలూ, మనుమరాళ్ళతో వ్యాపకం ఎక్కువవడం వల్లగానీ, లేదంటే ఈ మధ్య కాలంలో కృష్ణమూర్తిని ఒక్కసారైనా కలిసుండేవాడ్ని. ఇప్పుడు ఇలా అతన్ని అన్వేషించాల్సిన అవసరం వస్తుందని ఊహించలేకపోయాను.

ఏది ఏమైనప్పటికీ అతని బహుమతిని మళ్ళీ అతనికే బహూకరించాలన్న ఊహ నాకు కాస్త ఊరటనిచ్చింది.

కృష్ణమూర్తిని కలిసేదాకా మనసుని స్థిమితంగా వుంచేటట్టు లేదు ఆ పుస్తకం.

అడ్రస్ తీసుకుని బయల్దేరాను.

చాలా సంవత్సరాల ఎడబాటు వలన ఆ ప్రాంతాన్ని సరిగా పోల్చుకోలేకపోయాను. కొత్తగా వెలిసిన భవంతుల మధ్య ఆ ఇంటిని పోల్చుకోవడం కాస్త పనే అయింది.

కృష్ణమూర్తి నన్ను చూశాక ఎలా స్పందిస్తాడు? ఆప్యాయంగా కావలించుకుంటాడా? లేదా నిర్లిప్తంగా నవ్వి వూరుకుంటాడా?

అతని దగ్గర నేను తొందరపడకూడదు. ఆనీ ఇవీ మాట్లాడి కాలాన్ని కాస్త కరిగించేక అప్పుడు పుస్తకాన్ని తీసి అతడికి బహుకరించాలి. నా ఆలోచన బావుందనిపించింది.

కాలింగ్ బెల్ నొక్కాను.

లోపల దూరంగా అడుగులు చప్పుడు వినిపిస్తోంది.

నా గుండె వేగంగా స్పందిస్తోంది.

ఓ వృద్ధ స్త్రీ వచ్చి తలుపు తెరిచింది.

'మూర్తిగారనీ... అదే కృష్ణమూర్తిగారనీ... ఇంట్లో ఆయన లేరామ్మా?' – అడిగాను.

తన బోసినోరుని తెరిచి కాసేపు ఆలోచించిందామె.

'ఓహో ఆ కృష్ణమూర్తా? ఇల్లు అమ్మేసి వెళ్ళిపోయి చాన్నాళ్ళయింది' అంది.

నిస్సత్తువ ఆవహించింది నాకు.

'ఇప్పుడెక్కడుంటున్నారో కాస్త చెప్పగలరా?' అభ్యర్థనగా అడిగేను.

సరిగా తెలీదంటూ, తెలిసినకాడికి చెప్పింది.

ఆమె దగ్గర సెలవు తీసుకుని నడిచాను అన్యమనస్కంగా.

రోజులు గడిచేకొద్దీ కృష్ణమూర్తిని కలియాలన్న తపన నాలో మరింత ఎక్కువవసాగింది.

ఆ అడ్రస్ పట్టుకుని చాలాచోట్ల తిరిగాను. చాలా ప్రయాసపడినాక దొరికిందా ఇల్లు.

కండువాతో నుదుటికి పట్టిన చెమటను వత్తుకుంటూ తలుపు తట్టాను.

కొన్ని క్షణాలు గడిచేత విసురుగా తలుపు తెరిచాడు ఇరవై ఏళ్ళ యువకుడు.

'తలుపు బాదేయడమేనేమిటి? బెల్ కొట్టొచ్చుగా...' కనీసం నా వయసునైనా చూడకుండా కసురుకున్నాడు.

'కృష్ణమూర్తిగారనీ...' అంటూ నసిగేను.

అతడ్ని చూస్తూంటే నాకు భయం వేస్తోంది. పోట్లగిత్తలా వున్నాడు. నేను నిష్క్రమిస్తే తలుపు వేసుకుందామని చూస్తూన్నట్టున్నాడు.

'లేరు. చనిపోయారు. ఆయనతో మీకేం పని?' గోడకి విసిరిన బంతిలా తిరిగొచ్చింది సమాధానం.

కృష్ణమూర్తి చనిపోయాడన్న వాస్తవాన్ని జీర్ణించుకోలేకపోతున్నాను. నా మనసు విలవిలలాడుతోంది.

'కృష్ణమూర్తికి స్నేహితుడ్ని బాబూ!' అన్నాను గాద్గదికంగా.

'లేరు మరి!' అంటూ దభేలున నా మొహం మీద తలుపు వేసుకున్నాడు.

నా మనసు బాధగా మూలిగింది. అతడు అవమానించాడని కాదు తులసి కడుపున గంజాయి మొక్క పుట్టినందుకు.

భారంగా వెనక్కి నడిచాను.

తండ్రి తాలూకు ప్రత్యక్ష సాక్షులనే గౌరవించలేని అతడు, పరోక్ష కానుకలను ఎలా గౌరవిస్తాడు. ఆ పుస్తకం ఆ షాపులోనికి ఎలా వచ్చిందో నా కర్థమైంది.


చేతి సంచిలో పుస్తకాన్ని తీసి ఆప్యాయంగా స్పర్శించాను.

భౌతికమైన మిత్రుడు బహూకరించిన బహుమతి.

అవును.

కృష్ణమూర్తి నా చెలిమికి ప్రసాదించిన చిరుకానుక అది. ▲

## నీమ్ కా పేడ్



గుండె పొరల్ని చీల్చుకుంటూ
శాఖోప శాఖలుగా విస్తరిస్తూ
విశ్వమంతా వ్యాపిస్తుంది

వసంతంలో విరబూసి
ఉగాది పచ్చడితో
ఊరంతా పండుగ చేయిస్తుంది

కొత్తగా కాపురానికి వచ్చిన
చిలకల జంటలకు
పచ్చ పచ్చని పందిళ్ళు వేస్తుంది

పండుగలకూ పబ్బాలకూ
అక్కా అన్నలతోపాటుగా
ఊయలలూపి ఆకాశపుటంచులను చూపిస్తుంది

రోగాలకూ, రొష్టులకూ
వైద్యంచేసే అపర ధన్వంతరిలా
అవతరిస్తుంది
మధ్యాహ్నాలు అమ్మలక్కలకు
కులాసా కబుర్ల రచ్చబండై
కాలక్షేపాలు చేయిస్తుంది
రాత్రిళ్ళు, అలసిన శరీరాలకు
వెన్నెల లేపనాలద్ది శీతల పవనాలతో
ఒడిలో సేదతీర్చే అమృతవల్లి అవుతుంది

ఓజోన్ గాయాలకు నవనీతాలద్దుతూ
పర్యావరణానికి పరిరక్షకునిగా
పచ్చదనాలకు నెలవుగా నిలుస్తూంది
మా పెరట్లో 'నీమ్ కా పేడ్!'

— చిదంబరం

